# కథాపోషకుడు

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"సరదాగా కలిసిపోదామంటే, బెట్టు చేస్తావేమిటోయ్? ఇంట్లో కూచుని ఏం పొడుగుతావు?" అని చెప్పాడు రామ్మూర్తి.

"ఈ విశ్వనాథంగారిని నే నెరగను. ఆయన నన్నెరగడు. ఆయన ఇంటిమీద పడి వారంరోజులు తిష్ఠవెయ్యటానికి నీకు సిగ్గు లేకపోతే నాకుండొద్దూ?" అన్నాను.

"చాలా పొరపాటుపడ్డావు. నీ పేరాయనకు తప్పక తెలిసుంటుంది. నిన్ను చూసి ఆయన సంతోషించకపోతే అప్పుడను!" అన్నాడు రామ్మూర్తి.

విశ్వనాథంగారు సాహితీప్రియుడనీ, పులి విస్తరాకుచుట్టూ కాకులుచేరినట్టు, వివిధ రచయితలు ఆయనఇంటిమీద వాలి రోజుల తరబడి పోరనీ నే నదివరకే విన్నాను. కాని ఇటువంటి కథలు నేన నమ్మలేను. నమ్మనూ లేదు.

ఆఖరుకు, రామ్మూర్తిబాధ పడలేక, వాడివ్వని ప్రగల్భాలని రుజువుచెయ్యటానికి, వాడివెంట బయల్దేరాను.

విశ్వనాథంగారు నిజంగా సాహితీప్రియుడే. సందేహం లేదు. ఆయనకు రాసేవాళ్లంటే చెప్పతరంగాని మమకారం. ఆయనతరంవాళ్లలో నటులమీదా గాయకులమీదా వ్యామోహం ఉన్నవాళ్ళని నే నెరుగుదునుగాని ఇటువంటి వ్యామోహం రచయితలమీద ఎవరికీ ఉండగా నేను చూడలేదు.

నేనూ రామ్మూర్తీ వెళ్లేసరికి ముగ్గురు నలుగురు ప్రసిద్ధరచయితలు ఉండనే ఉన్నారు. రామ్మూర్తిని చూడగానే విశ్వనాథంగారి ఆనందం చూసి నా శంక చాలా భాగం తీరింది. నా పేరు వినగానే ఆయన చూపిన సంతోషంతో అనుమానలేశం కూడా రహితమయింది. ఒక్కక్షణంలో విశ్వనాథంగారు నేను రాసిన అరడజను కథలపేర్లూ, అవి ప్రచురితమైన పత్రికలూ, సంవత్సరాలూ, మాసాలూకూడా ఏకరువు పెట్టేసి నన్ను ముగ్ధుణ్ణిచేసేశారు. ఇన్నేళ్లనుండి రచయితగా ఉండి నేను ఎన్నడూ ఆయనను చూడనందు కాయన నన్ను గట్టిగా కోప్పడ్డారు.

విశ్వనాథంగారు నన్ను ఒక సిగరెట్టుముక్కయినా స్వంతాన కొనుక్కోనివ్వలేదు. నేనూ రామ్మూర్తీ అక్కడున్న వారంరోజులూ మాకు అల్లుడిలా గడిచిపోయింది.

ఏడోరోజు ఒక చిత్రం జరిగింది.

విశ్వనాథంగారింటికి అనేకపత్రికలు వస్తాయి. అందులో ఒక పత్రికలో రామ్మూర్తి రాసిన కథ ఒకటి పడింది. అది చదువుతుండగా నాకు కంపరం ఎత్తేసి పోయింది. రామ్మూర్తి అందులో ఈ విశ్వనాథంగార్ని పెట్టి చాలా అల్లరిజేశాడు. ఆయనను పట్టి చవటకింద చూపించటమే కాక ఆయనదగ్గరవారిని గురించి కొన్ని అవాచ్యాలు కూడా రాశాడు.

నేను రామ్మూర్తిని ఇవతలికి పిలిచి, "ఇదేం పొయ్యేకాలం నీకు? ఈ పెద్దమనిషిమీద ఇట్లా రాశావు?" అన్నాను.

"అదంతా నిజమే. నేనేమీ కల్పించలేదు." అన్నాడు రామ్మూర్తి అమాయికం మొహంపెట్టి.

"నిజమైతేమాత్రం —"

"కథలు రాయమని పత్రికలవాళ్లు పీడిస్తే ఎట్లా చావనూ? ఇక్కడికి వచ్చిన రోజే కూర్చుని రాసి పంపాను! అన్నాడు రామ్మూర్తి.

వాడి మందమతికి ఆశ్చర్యం వేసింది

"నే చెప్పేది నీబుర్ర కెక్కటం లేదు. ఆయనమాస్తే ఏమనకుంటాడు ఇంటతని—"

"అదా నీ సందేహం? అట్లా చెప్పియేడవ్వేం? ఆయన ఈ కథను ముందే చూశాడు!" అన్నాడు రామ్మూర్తి.

"ఏమీ అనలేదా?"

"బాగుందన్నాడు."

"కనుక్కోలేదా?"

"ఏమిటి కనుక్కునేది? ఆయన చదువుతా డనుకున్నావా ఏమిటి? ఆయన సాహిత్యంచదవటం మానేసి చాలా ఏళ్లయింది. ప్రస్తుతం చూస్తూంటాడు - ఏ పత్రికలో ఎవ రెవరు ఏమేం రాస్తున్నారో!"

"అంతేనా?"

"అంతే."

ఆ సాయంకాలంబండికే నేను ఇంటిదారి పట్టాను. విశ్వనాథంగారు ఇంకా రెండురోజులుండమని బతిమాలారు. కాని నాకిక అన్నంగాని నిద్రగాని అనుభవంలోకి రాదని భయంవేసింది. (కొ. కు.)

---


**నారసింహలేహ్యము**

బంగారు చేర్పబడినది. మేహము, నిశ్శక్తి నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని.

పెరిదేపి—నెల్లూరు జిల్లా.